
బీమా.. పేదలకు ఏది ధీమా!

- బీమా పథకం ఏమైందంటున్న ప్రజలు
- ఏడాది గడిచినా దరఖాస్తులు స్వీకరించని సర్కారు
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమాతో పేద కుటుంబాలకు ఆసరా
- వైఎస్సార్ సీపీ హయాంలో 722 మందికి రూ.14.89 కోట్ల సాయం



నిడమర్రు: ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా వాటిని నెరవేర్చలేకపోతోంది. గత ప్రభుత్వంలో విజయవంతంగా అమలు చేసిన పథకాల పేరు మార్పుతోనే కూటమి ప్రభుత్వం సరిపెడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో కుటుంబ పెద్ద సహజ మరణం పొందినా లేదంటే ప్రమాదవశాత్తు మరణించినా బీమా పరిహారం అందేలా వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో చంద్రబాబు ఇస్తానన్న బీమా పథకం కుటుంబాల్లో చనిపోయిన ఇంటి పెద్దకు ఇస్తానన్న బీమా పథకాన్ని నేటి వరకూ అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్నారు.

నాడు రూ.14.89 కోట్ల పరిహారం చెల్లింపు

పేదలు, సంఘటిత కార్మిక కుటుంబాలపై భారం పడకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రీమియం ఖర్చును భరిస్తూ వైఎస్సార్ బీమా పథకం అమలు చేసింది. ఈ బీమా పథకంలో చేరిన వారికి ఒక గుర్తింపు కార్డు అందించారు. ఆ కార్డులో ప్రత్యేకరమైన గుర్తింపుసంఖ్య, పాలసీ నంబర్ వంటివి పొందుపరిచారు. గ్రామ, వార్డు సచివాలయాలకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. సందేహాలు నివృత్తి చేసేందుకు 155214 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటు లో ఉంచారు. వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి అర్హత కలిగిన వారిని ఈ స్కీమ్‌లో నమోదు చేసేవారు. గత ఐదేళ్లలో ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 722 మంది లబ్ధిదారులకు రూ.14.89 కోట్లు వైఎస్సార్ బీమా పథకం కింద బీమా సొమ్ములు అందించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

పేరు మార్పుతో సరి

వైఎస్సార్ బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రన్న బీమాగా పేరు మార్చి సరిపెట్టుకున్నారు. ఇప్పటి వరకూ ఈ పథకం విధి విధానాలను ప్రభుత్వం ప్రకటించ లేదు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద వశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబ నామినీకి రూ.10 లక్షలు అందిస్తామని ఎన్నికల ముందు హామీలను గుప్పించారు. కానీ ఆ పథకం గురించి నేటి వరకు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభం కాని వెబ్‌సైట్

2024 మే తరువాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం వెబ్‌సైట్‌ను తొలగించింది. ఆ తరువాత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కొత్తగా పేరు మార్చిన పథకం వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదని అధికారులు చెబుతున్నారు. మృతి చెందిన కుటుంబాల నుంచి క్లెయిమ్స్ స్వీకరించేందుకు మార్గదర్శకాలు ఇవ్వలేదు. బీమా దరఖాస్తులు స్వీకరించేందుకు ఇప్పటి వరకూ ఎలాంటి ఆదేశాలు లేవని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో కుటుంబ పెద్దను కోల్పోయిన బాధితులు బీమా సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారుల సంఖ్య	అందిన లబ్ధి
ఉంగుటూరు	220	రూ.4.21 కోట్లు
భీమడోలు	208	రూ.4.12 కోట్లు
నిడమర్రు	110	రూ2.43 కోట్లు
గణపవరం	184	రూ.4.13 కోట్లు
మొత్తం	722	రూ.14.89 కోట్లు

బీమా మంజూరు చేయాలి



కుటుంబ పెద్ద కోల్పోయిన మృతుల కుటుంబ సభ్యులకు హామీ మేరకు బీమా సొమ్మును కూటమి ప్రభుత్వం అందించాలి. వైఎస్సార్ సీపీ హయాంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి తక్షణ సాయం కింద అంత్యక్రియలకు రూ.10 వేలు ఇచ్చి, ఆ తరువాత మిగిలిన బీమా సొమ్మును నేరుగా నామినీ ఖాతాలో జమ చేసేవారు. ఈ పథకంపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది.

– కోడే కాశి, జెడ్పీటీసీ, నిడమర్రు

ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి సరైన గుణపాఠం నేర్పుతామని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ముదుగురు సూర్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం దెందులూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నేత బెజవాడ నరసింహంతో కలిసి ఆయన మాట్లాడారు. పట్టపగలు నడిరోడ్డు మీద జిల్లా పరిషత్ చైర్మన్‌పై కూటమినేతలు చేసిన దాడి దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దోషులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలన్నారు. బీసీలను చిన్నచూపు చూస్తే సహించేది లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి, డీజీపీ వెంటనే జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌పై జరిగిన దాడిని సీరియస్‌గా పరిగణించి నిందితులను అరెస్టుచేసి వారిపై క్రిమినల్‌కేసులు నమోదుచేయాలన్నారు. వారం రోజుల్లోనే రాష్ట్ర బీసీ సంఘంతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ హెచ్చరించారు.

సంఘ సభ్యుల అభివృద్ధికి కృషి

దెందులూరు: సీతంపేట కో–ఆపరేటివ్ సొసైటీ పరిధిలో ఉన్న సభ్యుల అభివృద్ధి సొసైటీ ఐక్యతకు కృషి చేస్తానని సీతంపేట కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన ఎలమర్తి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సీతంపేట సొసైటీలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. పలువురు నాయకులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యక్రమాలకు ఉచితంగా మైక్ సిస్టం

దెందులూరు: మండలంలో వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలకు, వైఎస్సార్ సీపీ నేతల కుటుంబ సభ్యుల శుభకార్యాలకు ఉచితంగా మైక్ సిస్టం స్టీరియో బాక్సులు అందజేస్తామని ముప్పవరం పంచాయతీ కండ్రిగ నరసింహపురం పార్టీ యువనేత మాండ్రు మధుబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ చివరి వారం నుంచి ఉచితంగా మైక్ సిస్టం స్టీరియో ఇస్తామని తెలిపారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



స్వామి వారికి అభిషేకాలు చేస్తున్న పూజారి

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామి వారి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పాలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని సుందరంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు, సాయి ఆచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వగ్వాల మీనాకుమారి అచ్యుతరామావు ఆర్థిక సాయంతో పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పాటమ్మకు ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

దెందులూరు: చల్ల చింతలపూడి పాటెమ్మ తల్లికి ఆదివారం ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ సీతంపేట సొసైటీ అధ్యక్షుడు ఎలమర్తి శ్రీనివాసరావు, గ్రామ మాజీ సర్పంచ్ ఎలమర్తి హేమలత ఆదివారం అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. తొలుత ఆలయ అర్చకులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్ల చింతలపూడి, పెరుగ్గూడెం, మేధినరావుపాలెం, రామారావుగూడెం, కొత్తకమ్మవారిగూడెం సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కనకదుర్గమ్మకు ఆషాఢం సారె



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

దెందులూరు: జాతీయ రహదారిపై కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ఘనంగా ఆషాఢ సారెను సమర్పించారు. భక్తులు ఊరేగింపుగా కనకదుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి ఆలయంలో భక్తులు పూజలు, ప్రదక్షిణలు చేశారు. సారె పదార్థాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ సంబరాలు

దెందులూరు: వేగవరం గ్రామంలో ఆదివారం గంగానమ్మ సంబరం వైభవంగా నిర్వహించారు. బోనాలతో భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని నీటిని వారపోసి పువ్వులు కానుకలు అందించారు. అమ్మవారికి 108 బిందెల నీటితో మంగళ స్నానం చేయించారు. అనంతరం నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వేగవరంతో పాటు సమీప గ్రామ శివారు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రదక్షిణలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

దెందులూరు: సీతంపేట పంచాయతీ సింగవరం యాదవ నగర్ లో నూతనంగా నిర్మించనున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన వెంట దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత సొసైటీ చైర్మన్లు ఎలమర్తి శ్రీనివాసరావు, గారపాటి కొండయ్య చౌదరి, బొడ్డేటి మోహన్, దెందులూరు ఎంఈఓ అన్నమ్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో టోల్ ప్లాజా



పంటబోదెలోకి ఆక్రమించి కట్టిన టోల్ ప్లాజా



మార్పు జరిగాక ఉంగుటూరు టోల్ ప్లాజా కార్యాలయాలు

ఉంగుటూరు: ఉంగుటూరు టోలు ప్లాజాను సమస్యలు చుట్టుముట్టాయి. కాలువ గట్టు మీద ఇరిగేషన్ స్థలంలో ఉన్న కార్యాలయాలను రాజకీయంగా కూటమి నాయకులు ఒత్తిడితో ఆక్రమణలుగా గుర్తించి పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నోటీసుతో కార్యాలయాలను మరో పక్కకు మార్చారు. అక్కడ కార్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు స్థలం సరిపోకపోవడంతో అక్కడే ఉన్న పంట బోదె వైపుకు కాస్త వెళ్లాల్సి వచ్చింది. అయితే ఆ స్థలం కూడా హైవే అథారిటీ వారిదే కావడంతో కొందరు విమర్శిస్తున్నా టోల్ ప్లాజా వారికి అభ్యంతరం లేకుండా పోయింది. పంటబోదె హైవే అథారిటీ స్థలంలోనే ఉండటంతో టోల్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ టోలు ప్లాజా వలన ఉంగుటూరు ఊర్లో నుంచి కాలువ గట్టు వెంబడి ఉన్న రహదారి నుంచి నాచుగుంట టోలు ప్లాజాకు టోలు ఎగవేతదారులు తిరుగుతున్నారు. దీంతో ఈ టోల్ ప్లాజా వలన తమ గ్రామంలో రహదారులు దెబ్బతింటున్నాయని కొందరు టోల్ ప్లాజా వారి మీద ఒత్తిడి పెంచుతున్నారు. టోల్ ప్లాజా వారు కూటమి నాయకులకు అనుకూలంగా ఉండకపోవడం మరో కోణంగా కనిపిస్తోంది. దీంతో సమస్యలు టోల్ ప్లాజా వారిపై ఒత్తిడి తీసుకొస్తూ ఇబ్బందులు పెడుతున్నట్లు తెల్సింది. ఈ విషయంపై టోల్ ప్లాజా సంబంధిత అధికారి ఒకరు మాట్లాడుతూ హైవే స్థలంలోనే టోల్ కార్యాలయాలు విస్తరించి ఉన్నాయని చెప్పారు. హైవే స్థలంలోనే పంటబోదె వెళుతోందని తెలిపారు.

ఊపందుకున్న వరి నాట్లు



వేగివాడలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

పెదవేగి: గోదావరి నీటితో మెట్ట ప్రాంత రైతులు కొద్దిపాటి ఊరటను పొందారు. సాగు పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. మెట్ట గ్రామాల్లోనూ, బోర్లు కింద ఉన్న పొలాల్లో నాట్లు సగం మేరకు పూర్తయ్యాయి. కొన్ని గ్రామాల్లో అయితే వర్షపాతం చాలక ప్రత్యామ్నాయ పంటలు వేయాలా? ఆలస్యంగానైనా వరినే కొనసాగించాలా అనే సందిగ్ధంలో ఉండగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నాట్లు ఊపందుకున్నాయి. పెదవేగి రైతులు మొక్కజొన్న వైపు దృష్టి సారించారు. వేగివాడ దిగువ గ్రామాల్లో యథావిధిగా వరి నాట్లు శరవేగంగా వేస్తున్నారు.

ఘనంగా అమ్మవారి సంబరం



అమ్మవారికి చీర, సారెలను సమర్పించేందుకు వెళుతున్న మహిళలు

పెదపాడు: మండలంలోని పెదపాడు శివారు రామచంద్రపురంలో గంగానమ్మకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పసుపు కుంకుమ నీళ్లతో మహిళలు అభిషేకం నిర్వహించారు, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి సారె చీరలను పట్టుకొని ఊరేగింపుగా బయలుదేరి సారె సమర్పించారు. అనంతరం కొత్తూరులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్దకు కాలినడకన వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ రాజశేఖర్

పెదపాడు: మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల పరిశోధనకు డాగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేసి అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాల సరఫరాను నిలుపుదల చేసేందుకు పోలీసుశాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

కొయ్యలగూడెం: పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. చొప్ప రామన్నగూడెంలో సీఐ బాల సురేష్ ఆధ్వర్యంలో దాడి చేయగా వారి నుంచి రూ.42,800 నగదు, ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి సమాచారాన్ని డయల్ 112 లేదా 9440796666 ద్వారా అందిస్తే, జూదరులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అంగన్‌వాడీలపై పని భారం తగ్గించాలి



మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి

చింతలపూడి: అంగన్‌వాడీ కార్యకర్తలపై యాప్‌ల పేరుతో విపరీతమైన పని భారం మోపుతున్నారని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి అన్నారు. ఆదివారం చింతలపూడిలో నిర్వహించిన అంగన్‌వాడీ ప్రాజెక్ట్ మహాసభ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ జీతం మూరెడు పని భారం బారెడులా అంగన్‌వాడీలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభకు చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సరోజిని, టి.మాణిక్యం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. జిల్లా కమిటీ సభ్యురాలు బీజేఎం కుమారి మాట్లాడుతూ 2024లో రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజుల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ జేఏసీకి ఇచ్చిన అనేక హామీలను నేటికీ నెరవేర్చలేదని వెంటనే అంగన్‌వాడీలకు తెలంగాణ రాష్ట్రంలో వలే వేతనాలు పెంచి అంగీకరించిన వాటికి జీవోలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నత్త వెంకటేశ్వరరావు, బాలరాజు, ఎస్.సరోజిని, ఎ.సరళాదేవి, ఫణివర్ధిని, ఈశ్వరి, సత్యవతి, అరుణ కుమారి, నాగమణి, హేమలత, చెన్నకేశ్వరి, పాపరత్నం, పూజ దేవి, మరియమ్మ, ఝాన్సీ, బాబి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. వ్యాధుల గాలం



పెదకడిమి ప్రారంభంలో పలకరిస్తున్న చెత్తాచెదారం



కొప్పాక పెట్రోల్ బంక్ సమీపంలో అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్యం

- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- పరిశుభ్రతకు ప్రాధాన్యం
- కలుషిత ఆహారం, నీరు ప్రమాదకరం

పెదవేగి: వర్షాకాలం అడపా, దడపా కురుస్తున్న వర్షాలకు పాత నీటితో కొత్త నీరు కలుస్తుంది. దీంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం లలోపించి దోమలు, క్రిమికీటకాలు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలుతాయి. తొలకరి వర్షాలతో వాతావరణంలో వచ్చే మార్పులు ఇంటి పరిసరాల్లో నిలిచే మురుగు నీటితో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. మలేరియా, చికున్ గున్యా, డయేరియా, డెంగీ, ఫైలేరియా, స్వైన్‌ఫ్లూ వంటి సీజనల్ వ్యాధులు ఏటా ప్రజలను భయపెడుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అసలే కరోనా వ్యాప్తి ముమ్మరంగా ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉంటూ, జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. మండలంలో కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నివాస ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. డ్రెయినేజీలోని పూడికను ఎప్పటికప్పుడు తీసి నీరు నిల్వ లేకుండా చూడాలి. మురుగు నీరు తొలగించిన తరువాత ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లాలి. దోమల నివారణకు మందును పిచికారీ చేయించాలి. తాగునీరు కలుషితం కాకుండా చూసుకుంటూ రక్షిత మంచినీరు పథకాల నిర్వహణ తీరుపై అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత మరుగుదొడ్లపై అవగాహన కల్పించి, వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో కొబ్బరి బొండాల వ్యాపారాలు, హోటళ్ల నిర్వాహకులకు చెత్తను గ్రామ పరిసరాల్లో వేయకుండా అవగాహన కల్పించాలి. ఆహార పదార్థాలపై మూతలు పెట్టాలి. కూరగాయలు వండే ముందు వాటిని శుభ్రం చేయాలి. వర్షాకాలంలో వీలైనంత వరకు మాంసాహారానికి దూరంగా ఉండాలి. జ్వరం, దగ్గు, తలనొప్పి ఉంటే వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. కలుషితమైన, నిల్వ చేసిన ఆహారం తినకూడదు.

వ్యాధులపై అశ్రద్ధ వహించొద్దు

వర్షాకాలం, పైగా కరోనా వైరస్‌తో కేసులు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రజలు వ్యాధుల విషయంలో అశ్రద్ధ చేయొద్దు. ఈ సీజన్‌లో ఎక్కువగా డెంగీ, అతిసారం ప్రబలే అవకాశం ఉంది. కలుషిత ఆహారం నీరు తీసుకోవటం ద్వారా డయేరియా వ్యాప్తి చెందుతుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వేడి చల్లార్చిన నీటిని తాగాలి. డయేరియా వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి.

– మల్లిఖార్జున్, వైద్యాధికారి, పెదవేగి పీహెచ్‌సీ

ఆలయానికి విరాళం అందజేత

కొయ్యలగూడెం: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి రూ. 1,11,111 విరాళం అందినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం భక్తులు, ఆయిల్ వ్యాపారి కొంపెల్ల సుబ్బారావు బ్రదర్స్ విరాళాన్ని అందించారన్నారు. పోతవరం రోడ్డులో రూ.35 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా ఆలయ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ప్రస్తుత ఆలయానికి వెనుక ఆలయాన్ని నిర్మిస్తున్నామని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాలాలయంలో దేవేరులతో సహా స్వామి వారికి నిత్య పూజాకైంకర్యాలు అందిస్తున్నామన్నారు. మేకల అన్నవరం, మంతెన సోమరాజు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మంచాల వెంకయ్య నాయుడు, కొంపెల్ల ప్రసాద్ పాల్గొన్నారు.